క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

కాటారం: ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ ఏడాది నుంచి వెదురు బొంగు సాగుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాముత్తారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజుల పని చేసి ఉండాలని, కుటుంబంలో ఒక వ్యక్తికి 15 గుంటల పట్టా భూమి లేదా ఆర్వోఎఫ్ఆర్ పట్టా కల్గిఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 60 మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు గుంతలు తీయడం, మొక్కలు నాటడం ఉపాధి హామీ పనిలో చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం రెండు సంవత్సరాల పాటు కూలి చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తుతో పాటు రైతు అంగీకారపత్రం, పట్టాదారు పాసుపుస్తకం, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, గ్రామపంచాయతీ తీర్మాన పత్రం జత చేసి ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నియామకం



రమేశ్

మల్హర్: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన దండు రమేశ్ మంగళవారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. గత 2016 సంవత్సరం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మన్‌గా చేసిన సేవలకు గుర్తింపుగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా అవకాశం కల్పించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల హక్కులను కాపాడుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అనూష, తదితరులు

చిట్యాల: సమాజంలో బాలికల హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మహిళా సాధికారత మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ కో–ఆర్డినేటర్ అనూష అన్నారు. మంగళవారం మండలంలోని చల్లగరిగలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనూష హాజరై మాట్లాడారు. కేంద్ర పభుత్వం ఆడ పిల్లల రక్షణ, విద్య కోసం బేటి బచావో బేటి పడావో పథకం ప్రారంభించినట్లు తెలిపారు. 18 సంవత్సరాలలోపు ఆడ పిల్లలు ఆపద సమయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, డీహెచ్ఈ స్పెషలిస్ట్ మమత, టీచర్లు శ్రీదేవి, రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గణపురం : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన విద్యార్థి కుమ్మరి క్రాంతికుమార్ బీఫార్మసీ అకడమిక్‌లో గోల్డ్ మెడల్ పొందగా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్స్ కాలేజీలో చదివి 27వ ర్యాంకు సాధించనందుకు గాను క్రాంతికుమార్‌ను అభినందించారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్, నాయకులు కట్ల శంకరయ్య, ఆరుమూళ్ల ఎల్లస్వామి, పీట్ల రంజిత్, సదానందం, రామకృష్ణ ఉన్నారు.

ప్రారంభం కాదు.. బస్సులు రావు!

- అలంకారప్రాయంగా చిట్యాల నూతన బస్టాండ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నిరుపయోగంగా బస్టాండ్

చిట్యాల: మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని గత ప్రభుత్వం హయాంలో బస్టాండ్ నిర్మించారు. కాగా, 2023 సంవత్సరంలో బస్టాండ్ నిర్మాణం పూర్తయింది. దీంతో ప్రయాణికులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కాని సంవత్సరాలు గడిచిన నూతన బస్టాండ్‌ను కనీసం ప్రారంభించకుండా అలాగే వదిలివేశారు. గతంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు మండల నాయకులు బస్టాండ్ చుట్టూ సీసీ రోడ్డు వేయించాలని కోరడంతో వెంటనే స్పందించి బస్టాండ్ సీసీ రోడ్డు వేయించారు. కానీ ఇంతవరకు బస్టాండ్‌ను మాత్రం ప్రారంభించకపోడంతో నిరుపయోగంగా మారింది. బస్సులు రాకపోవడంతో పాటు సంబంధిత ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు కూర్చోవాల్సిన బస్టాండ్ ఎందుకు పని రాకుండా పోతుంది. బస్టాండ్ నిర్మాణం కోసం రూ.లక్షలు వెచ్చించి వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని గ్రామాల నుంచి మండల కేంద్రానికి అనునిత్యం ప్రయాణికులు వస్తూ పోతుంటారు. ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభం చేసి ప్రయాణికులకు వసతులు కల్పించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

బస్టాండ్‌ను ప్రారంభించాలి



మండల కేంద్రంలోని నూతన బస్టాండ్‌ను అధికారులు, పాలకులు స్పందించి త్వరితగతిన ప్రారంభించాలి. అలాగే మండల కేంద్రానికి వచ్చే బస్సులను నూతన బస్టాండ్ వద్ద నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

నాణ్యమైన భోజనం అందించాలి

- మండల ప్రత్యేకాధికారి సునీల్‌కుమార్



వంటగదిని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

రేగొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సునీల్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మహాత్మజ్యోతి బాపూలే బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని, నిత్యావసర సరుకులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వంటగది, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న తిరుమల

కాటారం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య కార్మికులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాపురెడ్డి, ఆత్మకూరి కుమార్‌యాదవ్, మహేశ్, బాపు, గంట దేవదాస్ ఉన్నారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

గణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ వల్ల 1000 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, 100 మందికి పైగా మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజుల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో గణపురం మండలంలోని పాఠశాలలను సందర్శించడం జరిగిందని పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, 380మంది విద్యార్థులు ఉంటే అందులో 220 మంది బాలికలు ఉన్నట్లు వారికి కేవలం ఆరు మరుగుదొడ్లు ఉన్నాయని తెలిపారు. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గాంధీనగర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రహరీ లేదని, అదనపు తరగతి గదులు అవసరం ఉన్నాయని, ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌లో బెంచీలు ఒక్క రూంలో వేశారని అవి విద్యార్థులకు అందుబాటులో లేవన్నారు. 280 మంది విద్యార్థులకు చాలీచాలని భోజనం ఏర్పాటు చేస్తున్నారని, బీసీ హాస్టల్ పరిస్థితి మరి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో 24 గంటల వైద్యసేవలు ఉండేవని, ఇప్పుడు 12గంటల వైద్యసేవలు అందించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని లేకపోతే తమకు అవకాశం కల్పిస్తే జీఎంఆర్ ట్రస్టు నుంచి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆయన వెంట వరంగల్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, నాయకులు మోతె కర్ణాకర్ రెడ్డి, పొలసాని లక్ష్మీనరసింహ రావు, పోరెడ్డి పూర్ణచంద్రా రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి అర్బన్: అథ్లెటిక్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అబేండ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సైతం రాణించాలన్నారు. కాగా, అండర్ 8 నుంచి 20 సంవత్సరాల వరకు బాలబాలికలు, మహిళలు, పురుషులకు రన్నింగ్, లాంగ్ జంప్, జావలిన్ త్రో, షాట్ పుట్ క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా నలుమూలల నుంచి 450 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు పంతకాని సమ్మయ్య, పూతల సమ్మయ్య, స్టేడియం కోచ్ రఘువీర్, అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, అజయ్, సాంబమూర్తి, పూర్ణిమ, శ్రీనివాస్, సృజన పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

చిట్యాల: ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో నూతనంగా ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఏనాడు విద్యార్థులను పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, ఎంపీడీఓ జయశ్రీ, ఎంఈఓ కొడెపాక రఘుపతి, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా , నాయకులు మధువంశీకృష్ణ, కుమార్, దొడ్డి కిష్టయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యకు ప్రాధాన్యం

గణపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం కల్పించినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం మండలంలోని చెల్పూరు ప్రభుత్వ పాఠశాల పీఎంశ్రీ ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో పలు అభివృద్ధి పనులకు రూ.15లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగుల పంచమి వేడుకలు



మల్హర్: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



మొగుళ్లపల్లి : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మల్హర్: మండలంలో నాగుల పంచమి వేడుకలను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కొయ్యూరు నాగులమ్మ వద్దకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నాగలమ్మను దర్శంచుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు

మొగుళ్లపల్లి : నాగుల పంచమి సందర్భంగా మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోగల నాగదేవత ఆలయంలోని పుట్ట వద్ద ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు మహిళలు పాలు పోశారు. నాగేంద్రుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వేడుకున్నారు.అనంతరం పలువురు ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలోని నాగదేవతకు భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

'కాంగ్రెస్ అండతోనే ఇసుక దందా'

కాటారం : రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకుల అండతోనే కాటారంలో ఇసుక దందా కొనసాగుతుందని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని విలాసాగర్ మానేరు నుంచి ఇసుక మాఫీయా పెద్ద ఎత్తున వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు లారీల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక దందా వ్యవహారంలో కాంగ్రెస్ నాయకుల పాత్రను పూర్తి ఆధారాలతో బయటపెడుతామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించి కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కిరణ్ వెంట బీఆర్ఎస్ నాయకుడు ఉప్పు సంతోష్ ఉన్నారు.


ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: బాలసంత, కాటిపాపల కులస్తులకు ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వొద్దని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబాకు దళిత సంఘాల ఆధ్వర్యంలో వితనతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేడబుడగ జంగాలమని తప్పుగా చెప్పి ఎస్సీ కులం సర్టిఫికెట్ తీసుకుంటున్న వాటిని రద్దు చేయాలని పేర్కొన్నారు. నాయకులు పుల్ల మల్లయ్య, జేరిపోతుల ఓదేలు, దూడపాక సాంబయ్య, రఘుపతి, దివాకర్, శివశంకర్, నరేష్, ఆశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్యదర్శి

మొగుళ్లపల్లి : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, కాలుష్యాన్ని నియంత్రించేందుకు చెట్లను పెంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పెంచాలన్నారు. ఇంటింటికి ఆరు మొక్కలను పెంచాలన్నారు. అడవులు అంతరించి పోవడంతోనే వర్షాలు కురవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'విశ్వ బ్రాహ్మణులపై ప్రభుత్వం చిన్నచూపు'



మాట్లాడుతున్న చంద్రమౌళి

చిట్యాల: విశ్వ బ్రాహ్మణ(విశ్వకర్మ)లపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పొతుగంటి చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చల్లగరిగ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘంలో గల ఐదు కులాల్లో 60 మంది సభ్యులు ఉండగా ఏ ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించలేదని అన్నారు. కులవృత్తినే నమ్ముకుని అద్దె ఇంట్లో ఉంటున్న సభ్యులకు కూడా ఇళ్లు కేటాయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సిద్దోజు శ్రీనివాస్‌చారి, రాంబ్రహ్మచారి, పోతుగంటి మురళి, కళ్యాణ్, ఆనందచారి, సంతోష్, సిద్దోజు బ్రహ్మచారి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేగొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ గూడెపు మనోరమ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలో నర్సింగ్ 1, నర్సింగ్ 2 బోధించుటకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు, కామర్స్ బోధించుటకు బీఈడీతో పాటు ఎంకామ్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మండల కేంద్రంలోని కేజీబీవీలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో నేడు(బుధవారం), రేపు(గురువారం) హాజరు కావాలని తెలిపారు.

కాటారంలో..

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ కళాశాలలో ఖాళీగా ఉన్న సోషల్, మ్యాథ్స్ టీచర్ పోస్టులకు గెస్ట్ ఉపాధ్యాయుల పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారిణి చల్ల సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు సోషల్, ఇంటర్ విద్యార్థులకు గణితం బోధించే వారికి అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు. సోషల్ టీచర్ పోస్టు కోసం బీఎడ్, టెట్ అర్హత, కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్ పోస్టుకు పీజీలో మ్యాథ్స్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా పూర్తి సర్టిఫికెట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిట్యాలలో..

చిట్యాల: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో తాత్కాలిక బోధన చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ విద్యార్థులకు బోధించుటకు అర్హత గల మహిళా అభ్యర్థులు ఆగస్టు 1లోపు కళాశాలలో దరఖాసు చేసుకోవాలని సూచించారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్, సివిక్స్ బోధించుటకు అభ్యర్థులు ఎంఎ ఇంగ్లీష్, బీఈడీ, ఎంఎ పొలిటికల్ సైన్స్, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 1లోపు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో బోధించుటకు ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్ఓ కనక లక్ష్మి ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించుటకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగలరన్నారు. బీఈడీ పూర్తి చేసి టెట్ క్వాలిఫై ఉండాలని తెలిపారు. ఈనెల 31లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



కాటారం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు



కాళేశ్వరం: మొక్క నాటుతున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

- కాటారం డిప్యూటీ రేంజర్ సురేందర్

కాటారం : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని, వాటికి ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలని కాటారం డిప్యూటీ రేంజర్ సురేందర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కాటారం రేంజ్ పరిధిలోని కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వనమహోత్సవం, పులుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో పూల, పండ్ల మొక్కలు నాటారు. వన్యప్రాణుల పెద్ద ఎత్తున జీవించాలంటే అడవులను విరివిగా పెంచాలని అటవీశాఖ అధికారులు తెలిపారు. పులులు అడవికే రాజసం తీసుకొస్తాయని ప్రతి వన్యప్రాణి ఒక్కో విశిష్టతను కలిగి ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ చంద్రశేఖర్, బీట్ అధికారులు మొయినోద్దీన్, రాజేందర్, అశోక్, సంజీవ్, రాజ్‌కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులులను సంరక్షించాలి

కాళేశ్వరం : అడవుల్లో నివసించే పులులను రక్షించాలని మహదేవపూర్ అటవీశాఖ రేంజర్ ఆర్.రవికుమార్ అన్నారు. మంగళవారం జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా రేంజర్ మాట్లాడుతూ.. అడవులను కాపాడితే జీవకోటికి మనుగడ సాధ్యమని తెలిపారు. విద్యార్థులకు అడవులు, అడవుల్లో జీవించే జంతువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ రాజేశ్వర్, ఎఫ్ఎస్ఓలు ఆనంద్, వరుణ్, తిరుపతి, ఎఫ్‌బీఓ సదానందం, శ్యామ్, తాజొద్దీన్, బేస్ క్యాంపు సిబ్బంది, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

కన్నాయిగూడెం : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించడంతో ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్నేహారెడ్డి తెలిపారు. మండలంలోని కేజీబీవీలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపురంలో..

వాజేడు: మండల పరిధిలోని గణపురంలో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందించడంతో పాటు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రత్యేకంగా జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశవర్కర్ తదితరులు ఉన్నారు.